తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్, హ్యాకింగ్ సెగలు మళ్లీ రాజుకున్నాయి. అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రధానంగా సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న యువ నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. సంగారెడ్డి జైలు వేదికగా సాగిన ఈ రాజకీయ విమర్శలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ప్రతిపక్ష నేతలను ఇబ్బందులకు గురిచేయడం ద్వారా అధికారాన్ని కాపాడుకోవాలని చూడటం అవివేకమని కేటీఆర్ హెచ్చరించారు. ప్రభుత్వంలోని లోపాలను ప్రశ్నించినందుకే మాజీ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ ని అరెస్ట్ చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. సోమవారం సంగారెడ్డి జైలుకు వెళ్లిన ఆయన అక్కడ రిమాండ్ లో ఉన్న క్రిశాంక్ ను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అరాచకాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్రిశాంక్ పై ఏకంగా 35 కేసులు పెట్టడం రేవంత్ రెడ్డి పైశాచిక ఆనందానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులతో ఉద్యమకారుల గొంతు నొక్కలేరని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. క్రిశాంక్ లాంటి నాయకులకు పార్టీ పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హ్యాకింగ్ అంశంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. బెంగళూరు నుంచి ప్రత్యేకంగా హ్యాకర్లను రప్పించి బీఆర్ఎస్ ముఖ్య నేతల ఫోన్లను హ్యాక్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కేవలం ఫోన్లు మాత్రమే కాకుండా నేతల ఇళ్లలోని సీసీ కెమెరాలను సైతం హ్యాక్ చేస్తూ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తున్నారని మండిపడ్డారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రతిపక్షాల కదలికలను నిరంతరం పర్యవేక్షించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి చర్యల ద్వారా భయానక వాతావరణాన్ని సృష్టించాలని ప్రభుత్వం భావిస్తోందని విమర్శించారు. ఇప్పటికే మాజీ మంత్రి హరీశ్ రావు సైతం ఇదే తరహా హ్యాకింగ్ ఆరోపణలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమైన ప్రభుత్వం ప్రతిపక్షాలను వేధించడమే పనిగా పెట్టుకుందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ, సోషల్ మీడియా కార్యకలాపాలపై పెట్టిన దృష్టిలో ఒక శాతమైనా సామాన్య ప్రజల భద్రతపై పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో నేరాలు పెరుగుతున్నా పట్టించుకోని ముఖ్యమంత్రి తన రాజకీయ ప్రయోజనాల కోసం పోలీసు యంత్రాంగాన్ని వినియోగించుకుంటున్నారని దుయ్యబట్టారు. కేవలం సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినంత మాత్రాన జైలుకు పంపడం ఏ రకమైన ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. శాంతిభద్రతల నిర్వహణపై దృష్టి సారించకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. పోలీసు యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరుపై కేటీఆర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పోలీసులు ప్రజలకు అండగా ఉండాల్సింది పోయి ముఖ్యమంత్రి సొంత సైన్యంలా మారుతున్నారని విమర్శించారు. ప్రైవేట్ ఆర్మీ లాగా పనిచేస్తూ ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టడం తగదని హితవు పలికారు. చట్టాన్ని గౌరవించాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి పనిచేయడం విచారకరమని అభిప్రాయపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారుల తీరును ప్రజలు గమనిస్తున్నారని గుర్తు చేశారు. భవిష్యత్తులో వీరంతా జవాబుదారీ కావాల్సి ఉంటుందని ఆయన హెచ్చరికలు జారీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలుతోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ అవినీతి చిట్టాను బయటపెడుతున్నారనే అక్కసుతోనే క్రిశాంక్ లాంటి వారిని టార్గెట్ చేస్తున్నారని చెప్పారు. అభివృద్ధి పనుల్లో జరుగుతున్న అక్రమాలను ప్రశ్నించే గొంతుకలను అణచివేసే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తూ సొంత ఖజానాలను నింపుకుంటున్నారని విమర్శించారు. ఈ అవినీతిపై బీఆర్ఎస్ పోరాటం ఆపబోదని స్పష్టం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రభుత్వ తప్పులను ఎండగడుతూనే ఉంటామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న డాక్టర్.చందా సంతోష్ కుమార్



**విశాలభారతి, కరకగూడెం;** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కరకగూడెం మండలం, కరకగూడెం గ్రామానికి చెందిన కొంపెల్లి చిన్న రామలింగం గౌడ్‌నిర్మల దంపతుల కుమారుడు వంశీదుర్గా భవాని వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొని నూతన వధూ వరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన టీపీసీసీ సభ్యులు డాక్టర్.చందా సంతోష్ కుమార్ మరియు కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్‌ఈ కార్యక్రమంలో కరకగూడెం సర్పంచ్ పోలేబోయిన సుజాత గారు, నియోజకవర్గ యూత్ నాయకులు మిట్టపల్లి నితిన్ గారు, మండల నాయకులు షేక్ రఫీ గారు, పోలేబోయిన పాపారావు గారు, మిత్రులు, కార్యకర్తలు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దేశంలోనే తొలి వర్క్ సైట్ స్కూల్ ప్రారంభం



**రాజేంద్రనగర్, విశాలభారతి:** నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వలస కార్మికుల పిల్లలకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో, దేశంలోనే తొలిసారిగా ప్రత్యేక "వర్క్ సైట్ స్కూల్"ను నార్సింగిలో ప్రారంభించారు. ఈ వినూత్న విద్యా కార్యక్రమాన్ని నార్సింగిలోని రాజపుష్ప లేబర్ క్యాంప్‌లో ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ మరియు సీఎంసీ కమిషనర్ సృజన సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం తెలంగాణ విద్యాశాఖ, మున్సిపల్ శాఖ మరియు రాజపుష్ప ప్రాపర్టీస్ భాగస్వామ్యంతో చేపట్టబడింది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన నిర్మాణ కార్మికుల పిల్లలు విద్యకు దూరమవుతున్న నేపథ్యంలో, వారికి సురక్షితమైన, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించడం ఈ పాఠశాల ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. చిన్నారులు పనిచేసే ప్రాంతానికే సమీపంలో విద్యను అందించడం ద్వారా వారు చదువును కొనసాగించేందుకు వీలు కల్పించడం ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత. ఈ వర్క్ సైట్ స్కూల్ ద్వారా పిల్లలకు నాణ్యమైన ప్రాథమిక విద్యతో పాటు, అవసరమైన మౌలిక సదుపాయాలు, సంరక్షణ, మరియు మార్గదర్శకత్వం అందించనున్నారు. భవిష్యత్తులో ఇటువంటి విద్యా కేంద్రాలను మరిన్ని నిర్మాణ ప్రాంతాల్లో విస్తరించే యోచనలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వలస కార్మికుల పిల్లలకు విద్యలో కొత్త దారులు తెరుచుకుని, వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడనుంది.

## మూడు రాష్ట్రాల్లో విజయ డంకా మోగించిన బీజేపీ

**కాటేదాన్‌లో ఘన విజయోత్సవాలు**



**రాజేంద్రనగర్, విశాలభారతి:** పుదుచ్చేరి, అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఘన విజయాన్ని సాధించిన భారతీయ జనతా పార్టీ విజయోత్సవాలు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ బీజేపీ కార్యాలయం వద్ద ఉత్సాహభరితంగా నిర్వహించబడ్డాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలను అంబరాన్ని అంటించారు. డివిజన్ అధ్యక్షుడు గోదా పాండు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడు రాష్ట్రాల్లో సాధించిన విజయం దేశవ్యాప్తంగా బీజేపీపై ప్రజల విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు మిఠాయిలు పంచుకుని, బాణాసంచా పేల్చుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. "విజయ డంకా మోగించిన బీజేపీ" నినాదాలతో కాటేదాన్ ప్రాంతం మారుమోగింది. పార్టీ శక్తి, ఐక్యత, నాయకత్వంపై ఉన్న నమ్మకమే ఈ విజయాలకు కారణమని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ విజయోత్సవాల్లో రావుల భాస్కర్, సంతోష్ గౌడ్, నవారు మురళి, నర్సిరెడ్డి, రమణ గుప్తా, బుచ్చిరెడ్డి, ఎల్వీ రెడ్డి, పృథ్వీరాజ్, తలారి చిన్న శ్రీకాంత్ రెడ్డి, రమేష్, బొమ్మరాజు నరసింహ, మధుసూదన్ రెడ్డి, శంకర్ రెడ్డి, సురేష్ యాదవ్, రాజ్‌కుమార్, రామారావు, శేఖర్, కొవ్వాకుల బాబురావు, అడిగే శివశేఖర్, అంజమ్మ, భారతి, భూషణ్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఇదే ఉత్సాహంతో రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా పార్టీ జెండా ఎగురవేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

## మియాపూర్‌లో చలివేంద్రం ప్రారంభం

- సేవాభావాన్ని ప్రతిబింబించే గొప్ప కార్యక్రమం
- డీసీసీ అధ్యక్షుడు నరసింహారెడ్డి .. జగదీశ్వర్ గౌడ్



**మియాపూర్, విశాలభారతి:** మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీ మెయిన్ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ నాయకుడు తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, ఓబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ చలివేంద్రం ప్రారంభం సేవాభావాన్ని ప్రతిబింబించే గొప్ప కార్యక్రమమన్నారు. జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ వేసవిలో దాహంతో బాధపడే ప్రజలకు చల్లని తాగునీరు అందించడం నిజమైన మానవత్వమని, 'నీరు జీవం' అని, ఆ జీవాన్ని కాపాడే ఈ చిన్న ప్రయత్నం ఎంతో విలువైనదన్నారు. ప్రతి ఒక్కరికీ ఉచితంగా శుద్ధమైన నీరు అందించడమే లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షుడు నల్ల సంజీవరెడ్డి, కోర్డినేటర్ రఘునందన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రవీందర్ రావు, నాయకులు వీరేందర్ గౌడ్, మోహనరెడ్డి, రాంచందర్ యాదవ్, ఇలియాస్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లిఖార్జున స్వామి కళ్యాణ మహోత్సవం


- యాదవ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా వేడుకలు
- బీఆర్ఎస్ నాయకులు దండెం రాంరెడ్డి ప్రత్యేక పూజలు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మున్సిపాలిటీ పరిధిలో శ్రీశ్రీశ్రీ అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ మల్లిఖార్జున స్వామి కేతమ్మ బ్రహ్మారాంబ కళ్యాణ మహోత్సవం మరియు ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం ఇబ్రహీంపట్నం వారి ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దండెం రాంరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులతో కలిసి దేవతలకు మొక్కులు చెల్లించి, ప్రాంత ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. కళ్యాణ మహోత్సవ వేడుకలు భక్తి శ్రద్ధలతో సాగగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు ముంత శంకర్ యాదవ్, ఉపాధ్యక్షుడు ఎలిగపల్లి ఐలయ్య యాదవ్, కోశాధికారులు ముంత నరసింహ యాదవ్, కసరమోని శివాజీ యాదవ్, ప్రధాన కార్యదర్శి జెనిగే లింగం యాదవ్, జెనిగే సతీష్ యాదవ్, రాజేందర్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రంగారెడ్డి, మొగుళ్ల రాంరెడ్డి, మధు తదితర ప్రముఖులు హాజరై కార్యక్రమానికి మరింత భక్తి వాతావరణం తీసుకువచ్చారు. ఈ వేడుకలు ప్రాంతీయ సాంప్రదాయాలను ప్రతిబింబిస్తూ, భక్తుల మధ్య ఐక్యతను పెంపొందించాయి.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకూడదు

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశించారు. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని రైతులు ఎక్కువసేపు వేచి ఉండకుండా, ఉదయం వేళల్లోనే ధాన్యం తూకం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా వడ్డదెబ్బకు గురై మరణించిన రైతు గౌరయ్య ఘటనపై ఆరా తీశారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. దండుమైలారం సహకార కేంద్రం ద్వారా రూ.50 వేల తక్షణ ఆర్థికసాయాన్ని అందజేశారు. ప్రభుత్వం తరఫున కూడా తగిన పరిహారం అందించి కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా టెంట్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అవసరమైన మేరకు సంచులు, తూకం యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు అందుబాటులో ఉంచి, ధాన్యాన్ని వీలైనంత త్వరగా తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే సహించబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. రైతు సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, వారి సమస్యల పరిష్కారంలో ఎటువంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, భాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


## బాలానగర్‌లో ఘనంగా హిందూ సమ్మేళనం

- 5,000 మందికి పైగా హాజరు



కూకట్ పల్లి, విశాలభారతి; సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని ప్రాంతంలో హిందూ ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా నిర్వహించిన హిందూ సమ్మేళన కార్యక్రమం అత్యంత వైభవంగా, ఆకర్షణీయంగా జరిగింది. బాలానగర్ జై శ్రీరామ్ జాక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మహాసభకు దాదాపు 5,000 మంది హిందూ సోదరులు, సోదరీమణులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొదటిసారిగా బాలానగర్ వేదికపై ఈ స్థాయిలో హిందూ బంధువులందరూ ఒకే చోట చేరడం విశేషంగా నిలిచింది. ఈ సమ్మేళనం ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించింది. రంగురంగుల సాంస్కృతిక కళారూపాలు, నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించగా, సామూహికంగా నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమానికి భక్తి మాధుర్యాన్ని చేకూర్చింది. పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ శ్రీ ఆదిత్య పరశ్రీ స్వామీజీ గారి ఆధ్యాత్మిక ప్రవచనాలు సభలో ఉన్నవారిని ఆలోచింపజేస్తూ, భక్తి మార్గంలో నడిచేలా ప్రేరేపించాయి. అలాగే అఖిల భారత గో సేవ ఫౌండేషన్‌కు చెందిన శ్రీ బాలకృష్ణ గురుస్వామి గోసంరక్షణ ప్రాముఖ్యతపై ఇచ్చిన సందేశం ప్రజల్లో చైతన్యాన్ని కలిగించింది. ఈ మేరకు తెలంగాణ ప్రాంత నిర్వాహకులు కాచం రమేష్ సమాజంలో ఐక్యత, సేవాభావం అవసరాన్ని వివరించగా, తెలంగాణ సామాజిక కార్యకర్త రుక్మిదేవి సందేశం మహిళల పాత్ర, సమాజ నిర్మాణంలో వారి బాధ్యతలను స్పష్టంగా చేశారు. మొత్తంగా ఈ హిందూ సమ్మేళనం బాలానగర్ ప్రాంతంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, హిందూ సమాజ ఐక్యతకు బలమైన వేదికగా నిలిచింది. పాల్గొన్నవారు ఈ కార్యక్రమాన్ని భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## రైతు సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట




- పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- రైతు వారం కార్యక్రమంలో చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి పిలుపు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు అండగా ప్రభుత్వం

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతుల కోసం చేపడుతున్న పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలపై రైతులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో సోమవారం నుండి శనివారం వరకు ' రైతు వారం ' గా ప్రకటించారు. ఈ నేపథ్యంలో సోమవారం అబ్దుల్లాపూర్ మెట్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి చిలుక మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చిలుక మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ..రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 8 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలుస్తోందన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని, అలాంటి పద్ధతులను అనుసరించాలని సూచించారు. గత ప్రభుత్వ కాలంలో ఏర్పడిన ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రస్తుత ప్రభుత్వం రైతులకు మేలు చేసే దిశగా ముందుకు సాగుతోందన్నారు. కల్తీ విత్తనాల నియంత్రణ, మార్కెట్ ధరలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు, అన్ని రకాల పంటలకు మద్దతు ధర వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం రైతు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించి, భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు గుర్తింపు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర చారి, సర్పంచులు మండుగుల విజయ శ్రీశైలం గౌడ్, కోట ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు ఏడీఏ పద్మజ, ఏడీహెచ్ అరుణ, ఎంఏఓ పల్లవి తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రాజేంద్రనగర్‌లో ప్రజా వాణి కార్యక్రమం నిర్వహణ



- 3 వినతుల స్వీకరణ

**రాజేంద్రనగర్, విశాలభారతి :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగవంతమైన పరిష్కారం అందించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న "ప్రజా వాణి" కార్యక్రమం భాగంగా, ఈ రోజు (04052026) ఉదయం 10:30 గంటలకు రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించబడింది ఈ కార్యక్రమానికి డివిజన్ స్థాయి అధికారులు హాజరై, ప్రజల నుండి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించారు. ప్రజల సమస్యలను నేరుగా వినడం, వాటికి తక్షణ పరిష్కార మార్గాలు సూచించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రజా వాణి కార్యక్రమంలో మొత్తం 3 దరఖాస్తులు స్వీకరించబడినవి. వాటిలో రెవిన్యూ, మున్సిపల్, హౌసింగ్ విభాగాలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. సంబంధిత శాఖల అధికారులు ఈ వినతులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత మరియు వేగం పెంచడానికి "ప్రజా వాణి" వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.స్థానిక ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ, తమ సమస్యలకు ప్రత్యక్షంగా వినిపించే వేదిక కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## జీడిమెట్లలో ప్రియుడి దారుణ హత్య

- సహజీవనం చేస్తున్న మహిళ, కుమారుడి ఘాతుకం
- మృతదేహాన్ని కవర్‌లో చుట్టి తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- గాంధీ ఆస్పత్రికి మృతదేహం తరలింపు, కేసు నమోదు



**జీడిమెట్ల, విశాలభారతి:** జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్ అంబేద్కర్ నగర్‌లో దారుణ హత్య చోటుచేసుకుంది. పదేళ్లుగా ఓ మహిళతో సహజీవనం చేస్తున్న వ్యక్తిని ఆ మహిళ, తన కుమారుడితో కలిసి హతమార్చినట్లు పోలీసులు తెలిపారు.వివరాల్లోకి వెళితే.. అంబేద్కర్ నగర్‌కు చెందిన మహిళ ఒక వ్యక్తితో గత పదేళ్లుగా సహజీవనం చేస్తోంది. కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం రాత్రి మహిళ, ఆమె కుమారుడు కలిసి అతడిని హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్‌తో చుట్టి అర్ధరాత్రి సమయంలో బయటకు తరలించేందుకు యత్నించారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులైన తల్లీకొడుకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపారు. స్థానికంగా ఈ ఘటన కలకలం రేపింది.

## పైడిగమ్మల్ విజయోత్సవ సంబరాలు

- మూడు రాష్ట్రాల్లో ఘనవిజయంపై హర్షం



**కోహిర్, విశాలభారతి:** ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో భాగంగా మూడు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించడంతో కోహిర్ మండలంలోని పైడిగుమ్మల్ లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ శుభసందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం పైడిగమ్మల్ చౌరస్తాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున బాణాసంచా కాల్చి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొత్తూరు శ్రీకాంత్ మాట్లాడుతూ, ఈ ఫలితాలు దేశంలో నరేంద్ర మోదీ గారి అవినీతి రహిత పాలనకు మరియు పేదల సంక్షేమం పట్ల ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనమని కొనియాడారు పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ అరాచకత్వాన్ని అణిచివేసి ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని ఆయన.పేర్కొన్నారు.తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో, మోసపూరిత పాలనతో ప్రజలను వంచిస్తోందని, ప్రజల్లో వారిపై తీవ్ర వ్యతిరేకత ఉందని విమర్శించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ విజయ సంబరాల్లో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పలువురు నేతలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉన్ని శ్రీనివాస్, రమేష్, బాలకృష్ణ, గ్రామ యువకులు,నరేంద్ర మోదీ నాయకత్వం వర్ధిల్లాలని, దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఈ సందర్భంగా నాయకులు నినదించారు.

## మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన జగదీశ్వర్ గౌడ్

- అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని వినతి
- ప్రతి కాలనీ, బస్తీ అభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడి



**సైబరాబాద్‌విశాలభారతి:** సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఐఏఎస్ సృజనను శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు.శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గచ్చిబౌలి, నల్లగండ్ల, మాదాపూర్, హఫీజ్‌పేట్,చందానగర్ డివిజన్లలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులను ఆదేశించాలని కమిషనర్‌ను కోరారు.ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్ పరిధిలోని కాలనీ, బస్తీ అభివృద్ధికి కృషి చేస్తామని, తమ దృష్టికి వచ్చే ప్రతి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బిఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సెక్రటేరియట్ ముట్టడి



**సికింద్రాబాద్, విశాలభారతి :** బిఆర్ఎస్వి నాయకులు సోమవారం సెక్రటేరియట్ ను ముట్టడించారు. రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపుమేరకు హైదరాబాద్ నగర నాయకుడు యాద క్రాంతి ఆధ్వర్యంలో సెక్రటేరియట్ని ముట్టడించడం జరిగింది .పెండింగ్ లో ఉన్న 8000 వేల కోట్ల బకాయిల ఫీజు రియాంబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని పోరు బాట పట్టిన నాయకులు. ప్రైవేట్ విద్యా సంస్థలకు అమ్ముడుపోయినటువంటి దద్దమ్మ రేవంత్ రెడ్డి సర్కార్ వెంటనే G.O 7 ను వెనక్కి తీసుకోవాలని పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యార్థుల పక్షాన రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నాం అన్నారు.ఈ కార్యక్రమంలో నగర నాయకులు విశాల్, సికింద్రాబాద్ నియోజకవర్గ నాయకులు అభి ముదిరాజ్, కరణ్ నాయక్, శశాంత్ రెడ్డి, హేమంత్ రెడ్డి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# కేరళం పాయే



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భారత రాజకీయాల్లో సుదీర్ఘకాలం పాటు శ్రామిక పక్షపాతిగా నిలిచిన వామపక్షాల ప్రభ క్రమంగా మసకబారుతోంది. కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కమ్యూనిస్టులకు గట్టి ఆశనిపాతంగా మారాయి. ఎల్‌డీఎఫ్ కూటమి ఘోర పరాజయంతో దేశంలోనే వామపక్షాల ఏకైక కోట కుప్పకూలింది. 140 అసెంబ్లీ స్థానాలున్న కేరళలో కేవలం 35 సీట్లకే ఎల్‌డీఎఫ్ పరిమితం కావడం గమనార్హం. వరుసగా రెండుసార్లు అధికార పీఠాన్ని అధిష్ఠించిన పినరయి విజయన్ హ్యాట్రిక్ విజయం సాధించి చరిత్ర సృష్టించాలని ఆశించినప్పటికీ ప్రజలు ఆయనకు నిరాశ మిగిల్చారు. గత జనవరిలో కమ్యూనిస్టు ఉద్యమ వందేళ్ల ఉత్సవాలను ఘనంగా జరుపుకున్న తరుణంలోనే ఈ ఏడాది దేశంలో అధికారానికి పూర్తిగా దూరమవ్వడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కేరళ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే 1956లో మలబార్, కొచ్చిన్, ట్రావెన్‌కోర్ ప్రాంతాల కలయికతో రాష్ట్రం ఏర్పడిన తర్వాత వామపక్షాలు తమ పట్టును బిగించాయి. 1957లో ఈఎంఎస్ నంబూద్రిపాద్ నేతృత్వంలో తొలి కమ్యూనిస్ట్ ప్రభుత్వం ఏర్పాటైనప్పుడు అది ప్రపంచ రాజకీయాల్లోనే ఒక సంచలనంగా నిలిచింది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన తొలి కమ్యూనిస్ట్ ప్రభుత్వం అదే కావడం విశేషం. భూసంస్కరణలు, విద్యా, ఆరోగ్య రంగాల్లో వామపక్షాలు తీసుకువచ్చిన మార్పులు ఆ పార్టీకి పటిష్టమైన పునాదిని నిర్మించాయి. 1967లో మళ్ళీ అధికారంలోకి వచ్చినప్పటికీ 1980 తర్వాత కేరళలో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటముల మధ్య ప్రత్యామ్నాయ పాలన ఒక ఆనవాయితీగా మారింది. ఈకే నాయనార్ వంటి దిగ్గజాలు మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి పార్టీ బలాన్ని నిలబెట్టారు.

పినరయి విజయన్ 2016లో అధికారంలోకి వచ్చిన తర్వాత తనదైన ముద్ర వేశారు. 2021లో వరుసగా రెండోసారి గెలిచి కేరళలో నాలుగు దశాబ్దాలుగా ఉన్న ప్రత్యామ్నాయ పాలన సంప్రదాయానికి తెర దించారు. అయితే రెండోసారి పాలనలో ప్రభుత్వంపై వ్యతిరేకత తీవ్రమైంది. తాజా ఎన్నికలలో పినరయి విజయన్ మరోసారి అధికారాన్ని చేజిక్కించుకోవాలని వ్యూహాలు రచించినా ఫలితం దక్కలేదు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి సంపూర్ణ ఆధిక్యంతో అధికారాన్ని కైవసం చేసుకుంది. ఈ ఓటమితో దేశంలో వామపక్షాల పాలన గల ఏకైక రాష్ట్రం కూడా చేజారిపోయింది. కేరళలో వామపక్షాల పతనం కేవలం ఒక రాష్ట్రానికే పరిమితం కాకుండా దేశంలో కమ్యూనిజం భవిష్యత్తుపై పెద్ద ప్రశ్నగా మారింది. గత దశాబ్ద కాలంలో కమ్యూనిస్టు పార్టీల ప్రభావం జాతీయ స్థాయిలో క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో 1977 నుంచి 2011 వరకు ఏకధాటిగా 34 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న వామపక్షాలు అక్కడ ప్రస్తుతం తమ ఉనికిని కోల్పోయాయి. త్రిపురలో కూడా 1978 నుంచి 2018 వరకు సుదీర్ఘ కాలం పాలించిన కమ్యూనిస్టులు చివరకు ఓటమి పాలుకాక తప్పలేదు. బెంగాల్, త్రిపురలలో అధికారాన్ని కోల్పోయిన తర్వాత కేరళ మాత్రమే వామపక్షాలకు ప్రధాన ఆలంబనగా నిలిచింది. బిహార్, పంజాబ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో వామపక్షాలు ఉన్నప్పటికీ అక్కడ ప్రాంతీయ పార్టీల నీడలోనే మనుగడ సాగిస్తున్నాయి. సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే శక్తి ప్రస్తుతానికి ఏ రాష్ట్రంలోనూ కనిపించడం లేదు. భారత రాజకీయాల్లో బలమైన శక్తిగా ఉన్న కమ్యూనిస్టు పార్టీలు నేడు తమ ప్రాబల్యాన్ని కోల్పోవడానికి మారుతున్న సామాజిక సమీకరణాలే ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. నిజాం వ్యతిరేక పోరాటం, తెలంగాణ సాయుధ పోరాటం వంటి ఎన్నో ఉద్యమాలలో కమ్యూనిస్టుల పాత్ర సామాన్యుల గుండెల్లో నిలిచిపోయింది. భూస్వామ్య వ్యవస్థను ఎదిరించి పేదలకు భూమి దక్కేలా పోరాడిన చరిత్ర వీరిది. కాలక్రమంలో పెట్టుబడిదారీ విధానం విస్తరించడం, ప్రాంతీయ పార్టీలు బలోపేతం కావడం వామపక్షాల ఓటు బ్యాంకును దెబ్బతీసింది. దీనికి తోడు పార్టీ అంతర్గత చీలికలు, సిద్ధాంతపరమైన భేదాలు బలహీనతకు దారితీశాయి.

యువతను ఆకర్షించడంలో విఫలం కావడం కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపింది. కమ్యూనిస్టుల చరిత్రను గమనిస్తే 1925 డిసెంబరులో సీపీఐ ఏర్పాటుతో భారతదేశంలో ఈ ఉద్యమం ఒక రూపాన్ని సంతరించుకుంది. రష్యా విప్లవ స్ఫూర్తితో ఎస్ఏ డాంగే, ఎంఎన్ రాయ్ వంటి నేతలు శ్రామిక వర్గం కోసం పార్టీని నడిపించారు. బ్రిటిష్ వలస పాలనలో అనేక నిషేధాలను ఎదుర్కొంటూనే వీరు రైతాంగ, కార్మిక ఉద్యమాలను నిర్మించారు. సింగరేణి, ఆర్టీసీ, బ్యాంకింగ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలలో కార్మిక హక్కుల సాధనలో వామపక్ష సంఘాల కృషి మరువలేనిది. ఎనిమిది గంటల పని విధానం, పెన్షన్ వంటి సౌకర్యాలు వీరి పోరాటాల ఫలితమేనని నిపుణులు చెబుతారు. 1964లో సిద్ధాంతపరమైన విభేదాల కారణంగా పార్టీ చీలి సీపీఎం ఏర్పడింది. ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఆర్థిక మార్పులు కూడా వామపక్ష సిద్ధాంతాలపై పెను సవాళ్లు విసిరాయి. మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థలు విస్తరించడంతో సోషలిస్టు దేశాలు సైతం తమ విధానాలను మార్చుకున్నాయి. చైనా, రష్యా వంటి దేశాలు ప్రైవేటీకరణ వైపు మొగ్గు చూపడం కమ్యూనిజం ప్రాభవాన్ని తగ్గించింది. భారతదేశంలో కూడా ప్రాంతీయ పార్టీలు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు దగ్గర కావడంతో కమ్యూనిస్టుల పోరాట నినాదాలకు ఆదరణ తగ్గింది. గతంలో పేదలే ప్రధాన అస్త్రంగా రాజకీయాలు చేసిన వామపక్షాలకు ఇప్పుడు అవే వర్గాలను కాపాడుకోవడం కష్టంగా మారింది. దేశవ్యాప్తంగా అభివృద్ధి నినాదం ముందు వామపక్షాల పాత సిద్ధాంతాలు ప్రభావం చూపలేకపోతున్నాయి. కేరళలో ఎల్‌డీఎఫ్ పరాజయంతో 1970 తర్వాత దేశంలోని ఏ రాష్ట్రంలోనూ కమ్యూనిస్టు పార్టీ అధికారంలో లేకపోవడం ఇదే తొలిసారి. సుమారు యాభై ఏళ్ల తర్వాత కమ్యూనిస్టులు పూర్తిస్థాయిలో అధికార రహితంగా మిగిలిపోయారు. తొలి లోక్‌సభ ఎన్నికలలో ప్రతిపక్ష స్థానంలో నిలిచిన సీపీఐ ప్రస్థానం నేడు కొన్ని స్థానాలకే పరిమితం కావడం ఆ పార్టీ దుస్థితికి అద్దం పడుతోంది. పశ్చిమ బెంగాల్‌లో జ్యోతిబసు 23 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసి రికార్డు సృష్టించగా త్రిపురలో మాణిక్ సర్కార్ 20 ఏళ్ల పాటు నిరాడంబర పాలన అందించారు. ప్రస్తుతం లోక్‌సభలో కేవలం ఎనిమిది మంది, రాజ్యసభలో ఐదుగురు సభ్యులు మాత్రమే వామపక్షాల నుంచి ఉండటం గమనార్హం. దేశవ్యాప్తంగా సుమారు 90 మంది ఎమ్మెల్యేలు మాత్రమే వామపక్షాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అందులో మెజారిటీ సంఖ్య కేరళ నుండే ఉండటం ఆ రాష్ట్ర ప్రాధాన్యతను తెలియజేస్తుంది. కేరళలో అధికారం కోల్పోవడంతో పార్టీ కేడర్ తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయింది. అచ్యుతానందన్ వంటి సీనియర్ నేతలు అందించిన స్ఫూర్తితో గెలిచిన ఎల్‌డీఎఫ్ ఇప్పుడు ఆ స్థాయి నాయకత్వాన్ని లోపించడం కూడా పరాజయానికి కారణంగా కనిపిస్తోంది. పినరయి విజయన్ పాలనపై వచ్చిన అవినీతి ఆరోపణలు, అధికార దుర్వినియోగం వంటి అంశాలు ఓటర్లను దూరం చేశాయి. శతాబ్ది ఉత్సవాలు జరుపుకున్న సంవత్సరమే ఇలాంటి ఫలితాలు రావడం కమ్యూనిస్టులకు గడ్డుకాలమేనని చెప్పవచ్చు. కమ్యూనిజం మనుగడకు సిద్ధాంతపరమైన సంస్కరణలు అత్యవసరమని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా తమ విధానాలను మార్చుకోకపోతే మరింత నష్టం జరిగే ప్రమాదం ఉంది. కేరళలో కేవలం 35 సీట్లకు పడిపోవడం అనేది రాబోయే ప్రమాదానికి సంకేతం. గతంలో బలమైన ఓటు బ్యాంకు కలిగి ఉన్న ప్రాంతాల్లో సైతం కమ్యూనిస్టులు తమ ఉనికిని కాపాడుకోలేకపోతున్నారు.

ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలను ఆకర్షించే సరికొత్త ఎజెండాను రూపొందించుకోవడంలో విఫలమయ్యారు. కేరళలో యూడీఎఫ్ కూటమి తిరిగి పుంజుకోవడం అనేది వామపక్షాల అసమర్థతను ఎత్తిచూపుతోంది. భారత రాజకీయ యవనికపై వామపక్షాలకు ఉన్న సుదీర్ఘ చరిత్ర, చేసిన పోరాటాలు అమోఘమైనవి. కార్మికుల హక్కుల రక్షణలో వీరి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. అయితే ఎన్నికల రాజకీయాల్లో మనుగడ సాగించాలంటే కేవలం గత చరిత్ర సరిపోదు. వర్తమాన పరిస్థితుల్లో జనాదరణ పొందే వ్యూహాలు అవసరమని కేరళ ఫలితాలు నిరూపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా వామపక్షాల అధికారం కనుమరుగవ్వడం భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక కీలక మలుపు. ఎర్ర జెండా మళ్ళీ తన పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలంటే మూలాల్లోకి వెళ్లి లోటుపాట్లను సరిదిద్దుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ ఫలితాలు భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఒక గట్టి పాఠంగా మిగిలిపోతాయి.

## అన్నదాత మృతి ప్రభుత్వ వైఫల్యమే

- రైతు కుటుంబానికి టీఆర్ఎస్ పార్టీ అండ



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** ఇబ్రహీంపట్నం మండలం, రాయపోల్ గ్రామంలో వడదెబ్బకు గురై మరణించిన రైతు గౌరయ్య కుటుంబాన్ని టీఆర్ఎస్ పార్టీ తెలంగాణ యువజన విభాగం అధ్యక్షుడు కంచర్ల శివారెడ్డి పరామర్శించారు. ధాన్యం ఆరబోసే క్రమంలో కనీస సౌకర్యాలు లేక, ఎండ తీవ్రతకు తట్టుకోలేక ప్రాణాలు కోల్పోయిన గౌరయ్య మృతి పట్ల ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కంచర్ల శివారెడ్డి మాట్లాడుతూ, పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితక్క ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి పార్టీ తరపున పూర్తి భరోసా కల్పిస్తున్నట్లు ప్రకటించారు. కవితక్క ఆదేశాలతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ క్రింది డిమాండ్లు చేశారు. రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా: మరణించిన రైతు కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కవితక్క గారు డిమాండ్ చేశారు. • అధికారుల సస్పెన్షన్: కొనుగోలు కేంద్రాల్లో కనీస నీడ, తాగునీరు వంటి వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించి, రైతు మరణానికి కారణమైన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలి. ఈ పరామర్శ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు మరియు రాయపోల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## మంత్రులు, జడ్జీల పేర్లతో ఐపీఎల్ టికెట్ల దందా!

- ప్రముఖుల సంతకాలు ఫోర్జరీ.. ఉప్పల్‌లో కేటుగాళ్ల ముఠా అరెస్ట్



**హైదరాబాద్:** ఐపీఎల్ క్రేజ్‌ను పెట్టుబడిగా మార్చుకొని సులభంగా డబ్బు సంపాదించాలనుకున్న ఒక ముఠా గుట్టును ఉప్పల్ పోలీసులు రట్టు చేశారు. సామాన్య ప్రజలను బురిడీ కొట్టించడం మాత్రమే కాకుండా, ఏకంగా దేశంలోని అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తుల పేర్లను వాడుకొని అధికారులను మోసగించిన తీరు విస్తుగొలుపుతోంది. మే 3వ తేదీన ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులకు, స్టేడియం పార్కింగ్ వద్ద టికెట్లను బ్లాక్‌లో విక్రయిస్తున్నారనే సమాచారం అందింది. వెంటనే రంగంలోకి దిగిన ఉప్పల్ ఎస్.ఐ. ఏ. మాధవరెడ్డి బృందం అక్కడ అనుమానాస్పదంగా ఉన్న ఒక మహీంద్రా థార్ వాహనాన్ని (AP 40BB6768) తనిఖీ చేసింది. పోలీసుల విచారణలో నిందితులు చేసిన నేరం వెలుగులోకి వచ్చింది. కేవలం బ్లాక్‌లో టికెట్లు అమ్మడం మాత్రమే కాకుండా, ఈ ముఠా పెద్ద స్కెచ్ వేసింది. గూగుల్ నుండి గౌరవనీయులైన జడ్జీలు, మంత్రులు మరియు గవర్నర్ల అధికారిక లెటర్ హెడ్‌లను డౌన్‌లోడ్ చేసేవారు. వాటిపై ప్రముఖుల సంతకాలను ఫోర్జరీ చేసి, హైదరాబాద్, తమిళనాడు మరియు కర్ణాటక క్రికెట్ అసోసియేషన్లకు సమర్పించేవారు. అలా వీవీఐపీల కోటాలో ఖరీదైన 'కాంప్లిమెంటరీ' టికెట్లను పొంది, ఆ తర్వాత వాటిని అవసరమున్న వారికి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న గట్టమనేని అశోక్, కంకనాల దినేష్ మరియు సింగమనేని వేణుమాధవ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ఒకరు రియల్ ఎస్టేట్ వ్యాపారి కాగా, మిగిలిన ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగులు. వీరంతా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పల్కూరు గ్రామానికి చెందిన వారు. కాగా, చెన్నైకి చెందిన ఆశిష్, సెంథిల్ మరియు తాన్సిల్ అనే ముగ్గురు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## ఏఐ, రోబోటిక్ లెర్నింగ్ ప్రోగ్రాం భేష్

- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ
- ఇలాంటి సమ్మర్ కోచింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిస్తాయి



**విశాలభారతి, గోదావరిఖని:** వేసవి సెలవులను సృజనాత్మకంగా వినియోగించుకునేందుకు తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్, టీ ఫైబర్, సూపర్ టీచర్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'సూపర్ సమ్మర్ కంప్యూటర్, ఏఐ & రోబోటిక్స్ లెర్నింగ్ ప్రోగ్రాం'ను సోమవారం ప్రారంభమైంది. గాంధీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సమీపంలోని గాంధీ పార్క్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంప్‌ను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ ప్రారంభించారు. విద్యార్థులతో మాట్లాడి లెర్నింగ్ ప్రోగ్రాం తీరుపై అడిగి తెలుసుకున్నారు. ప్రోగ్రామ్ నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. విద్యార్థులు ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకుని కంప్యూటర్, ఏఐ, రోబోటిక్స్‌పై ప్రాయోగిక జ్ఞానం పొందాలని సూచించారు. భవిష్యత్తులో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థులకు కంప్యూటర్ వినియోగం, ఏఐ యొక్క దైనందిన జీవితంలో ఉపయోగాలు, సరళమైన రోబోటిక్స్ నమూనాల తయారీ, ప్రాజెక్ట్ ప్రదర్శనలు వంటి అంశాల్లో ప్రాయోగిక శిక్షణ అందించనున్నారు. కార్యక్రమంలో ఏంఈఓ మల్లేశం, డీఆర్పీ ఎన్.రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.రాంబాబు, స్వరూప్ చంద్, రమేష్, పీఆర్పీ శ్రీలతతోపాటు తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ మేనేజర్ శ్రీరామ్ రాహూల్ జువ్వాడి బృందం పాల్గొన్నారు.

## వివేకానందనగర్‌లో రూ.60.50 లక్షలతో సీసీ రోడ్డు, కాల్వ పనులకు శంకుస్థాపన

- భద్రాద్రి టవర్స్ నుంచి శ్రీ సాయిటవర్స్ వరకు అభివృద్ధి పనులు
- పనుల్లో నాణ్యత, వేగం పాటించాలని అధికారులకు గాంధీ ఆదేశం
- శేరిలింగంపల్లిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని హామీ



**వివేకానందనగర్ విశాలభారతి:** వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీలో భద్రాద్రి టవర్స్ నుంచి శ్రీ సాయి టవర్స్ వరకు రూ.60 లక్షల 50 వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, వరద నీటి కాల్వ నిర్మాణ పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సోమవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. పనుల్లో నాణ్యతలో రాజీ పడొద్దని, జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలబెడతామని హామీ ఇచ్చారు. కాలనీల్లో థీమ్ పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్‌బీవీ ట్రస్ట్ ఫాల్జా శర్బత్ పంపిణీ


- ఎండవేడికి ఉపశమనంగా ఉచిత శీతల పానీయాలు
- సేవే లక్ష్యమన్న ట్రస్ట్ చైర్మన్ రాగిరి సుహాస్ గౌడ్




**సైబరాబాద్‌విశాలభారతి:** వేసవి తీవ్రత దృష్ట్యా శ్రీ భూసమేత వెంకటేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఫాల్జా శర్బత్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ రాగిరి సుహాస్ గౌడ్, వైస్ చైర్మన్ అల్లం నిఖిల్ గౌడ్ ఆధ్వర్యంలో ఎంవీఆర్ డెవలపర్స్ ప్రతినిధి మరికంటి శరత్ కుమార్ రెడ్డితో కలిసి శీతల పానీయాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సుహాస్ గౌడ్ మాట్లాడుతూ, సమాజ సేవే ట్రస్ట్ ప్రధాన లక్ష్యమన్నారు. ఎండల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని, భవిష్యత్తులో మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శ్రీనివాస్ గౌడ్, పుట్ట వినయ్ గౌడ్, కబీర్ కౌశల్, మియాపూర్ కంటెస్టెడ్ కార్పొరేటర్ మోహన్ ముదిరాజ్, బీజేపీ నాయకుడు సాయిరాం గౌడ్, ట్రస్ట్ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఈదులకుంట చెరువు కబ్జాపై సీపీఐ ఫిర్యాదు

- శేరిలింగంపల్లి తహశీల్దార్‌కు వినతిపత్రం
- సర్వే నెం.7లో 6.05 ఎకరాల చెరువులో సెల్లార్ తవ్వకాలు
- ఎన్‌వీఎన్ కన్‌స్ట్రక్షన్‌పై చర్యలకు డిమాండ్



**శేరిలింగంపల్లి విశాలభారతి :** ఖానామెట్ సర్వే నెం. 7లోని 6.05 ఎకరాల ఈదులకుంట చెరువును కబ్జా చేసి సెల్లార్ తవ్వుతున్న ఎన్‌వీఎన్ కన్‌స్ట్రక్షన్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఐ శేరిలింగంపల్లి నియోజకవర్గ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్, మండల తహశీల్దార్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించింది. ఖానామెట్ సర్వే నెం.7లోని చెరువు స్థలాన్ని కూకట్‌పల్లి సర్వే నెంబర్ల పేరుతో కబ్జా చేసి శరవేగంగా సెల్లార్ తవ్వుతున్నారని, మరో నాలుగైదు రోజుల్లో బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తాయని సీపీఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వ భూమి అని, ఈదులకుంట చెరువుగా రెవెన్యూ అధికారులు రాతపూర్వకంగా ధ్రువీకరించారని తెలిపారు. గతంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మూడుసార్లు చెరువును సందర్శించి ఇది చెరువేనని డిక్లేర్ చేశారని, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను పిలిపించి హద్దులు నిర్ణయించాలని, ఫెన్సింగ్ ఏర్పాటుకు ఆదేశించారని గుర్తుచేశారు. అయినా ప్రస్తుతం పెద్ద జేసీబీలతో సెల్లార్ తవ్వి చెరువును కనుమరుగు చేస్తున్నారని ఆరోపించారు. భూకబ్జాదారులపై తక్షణ చర్యలు తీసుకొని ఈదులకుంట చెరువును కాపాడాలని వినతిపత్రంలో కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ శేరిలింగంపల్లి కార్యదర్శి చందు యాదవ్, నాయకులు కె. అంజనేయులు, టి. రామకృష్ణ, కె. బీరప్ప, కే. వెంకటస్వామి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

- ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయం



**విశాలభారతి, భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా కరకగూడెం మండలంలోని జరుగుతున్న మద్యం అక్రమాలపై ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జేఏసీ మండల అధ్యక్షుడు గొగ్గలి కృష్ణ, మండల కన్వీనర్ సోలం రామారావు మాట్లాడుతూ. మద్యం అక్రమాలపై అన్యాయం జరుగుతుందని తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం లేదని ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. మద్యం మత్తులో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, అధికారులు మాత్రం మామూలు మత్తులో ఉన్నట్టుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. వరుసగా పత్రికల్లో కథనాలు ప్రచురితమవుతున్నప్పటికీ అధికార యంత్రాంగం స్పందించకపోవడం గమనార్హం. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధర కంటే ఒక్కో మద్యం బాటిల్‌పై 50 నుంచి 70 రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నట్లు వినిపిస్తున్నాయి. రోజంతా కూలికి వెళ్లి సుమారు 300 రూపాయలు సంపాదించే కార్మికులు, అలసటతో బెల్ట్ షాపులకు వెళ్లినప్పుడు అధిక ధరలతో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వారి జేబులకు భారమై, కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోంది. ఈ పరిస్థితుల వల్ల అనేక కుటుంబాలు ఆగమైపోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా గ్రామపంచాయతీలలో మద్యపాన నిషేధం అమలులో ఉన్నప్పటికీ, అనుమతి లేని బెల్ట్ షాపులు మాత్రం యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. స్థానికంగా పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోవడం ప్రజల్లో నిరాశను పెంచుతోంది. ఇకపై కూడా అధికారులు స్పందించకపోతే మండలంలోని ఆదివాసి, మహిళా సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జేఏసీ మండల అధ్యక్షుడు గొగ్గలి కృష్ణ, మండల కన్వీనర్ సోలం రామారావు పత్రికా ప్రకటన ద్వారా హెచ్చరిస్తూ, బెల్ట్ షాపులను అరికట్టే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, ప్రజల సమస్యలను పరిష్కరించాలని మండల ప్రజలు తరపున ఆదివాసి సంఘాల ఐక్యవేదిక కరకగూడెం మండల శాఖ అధికారులను కోరుతున్నారు.

## నీలిమా గ్రీన్స్ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

- హెచ్‌ఎండబ్ల్యూఎస్ జీఎంకు బీజేపీ నేత మహేష్ యాదవ్ వినతి
- శంకుస్థాపన జరిగినా పనులు ప్రారంభం కాకపోవడంపై ఆందోళన
- కాలనీవాసుల అపోహలు తొలగించి సమన్వయం చేయాలని సూచన



**శేరిలింగంపల్లివిశాలభారతి:** మదనగుడా డివిజన్ పరిధిలోని నీలిమా గ్రీన్స్ కాలనీ, సమీప అపార్ట్‌మెంట్‌ల ప్రజలు చాలా కాలంగా డ్రైనేజీ, వర్షపు నీరు నిల్వ ఉండటం వంటి తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి గతంలో శంకుస్థాపన చేసి శిలాఫలకం ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.ఈ నేపథ్యంలో సోమవారం హఫీజ్‌పేట్‌లోని హెచ్‌ఎండబ్ల్యూఎస్ జీఎంను కాలనీవాసులతో కలిసి బీజేపీ రాష్ట్ర నాయకులు బోయిని మహేష్ యాదవ్ వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా మహేష్ యాదవ్ మాట్లాడుతూ నీలిమా గ్రీన్స్ కాలనీతో పాటు చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ వాసులను సమన్వయం చేసుకుంటూ వారికి ఉన్న అపోహలను నివృత్తి చేయాలన్నారు. డ్రైనేజీ సమస్యను వీలైనంత త్వరగా శాశ్వత పరిష్కారం దిశగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## శిల్పారామంలో సమ్మర్ ఆర్ట్ క్యాంప్‌కు శ్రీకారం





- పాటరీ నుంచి లిప్పన్ ఆర్ట్ వరకు తొమ్మిది రకాల కళల్లో శిక్షణ
- పిల్లలు, పెద్దలకు ప్రత్యేక తరగతులు
- సాంప్రదాయ కళలతో సృజనాత్మకత వెలికితీతే లక్ష్యం: స్పెషల్ ఆఫీసర్ కిషన్‌రావు

**మాదాపూర్, విశాలభారతి:**

మాదాపూర్‌లోని శిల్పారామంలో సోమవారం సమ్మర్ ఆర్ట్ క్యాంప్ ప్రారంభమైంది. ఈ క్యాంప్‌లో పిల్లలతో పాటు పెద్దలకు కూడా సాంప్రదాయ కళల్లో శిక్షణ ఇస్తున్నారు.పాటరీ, పెన్సిల్ స్కెచ్, మధుబని పెయింటింగ్, పటచిత్ర పెయింటింగ్, అక్రిలిక్ పెయింటింగ్, సీషెల్ క్రాఫ్ట్స్, వాటర్ కలర్స్, క్లే టాయ్స్, లిప్పన్ ఆర్ట్ వర్క్ అనే తొమ్మిది విభాగాల్లో నిపుణులైన కళాకారులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. శిబిరంలో పాల్గొన్న వారంతా ఎంతో ఆసక్తిగా, శ్రద్ధగా కళలను నేర్చుకుంటున్నారు.ఈ సందర్భంగా శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ శ్రీ జి. కిషన్‌రావు ఐఏఎస్ మాట్లాడుతూ పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచి ఇలాంటి సాంప్రదాయ పెయింటింగ్స్, చేతి వృత్తుల్లో శిక్షణ ఇవ్వడం వల్ల వారిలో దాగి ఉన్న సృజనాత్మకత బయటకు వస్తుందన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని భారతీయ కళలు, సంస్కృతిని భావి తరాలకు అందించడమే ఈ క్యాంప్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

## నార్సింగిలో దేశంలోనే తొలి వర్క్ సైట్ స్కూల్ ప్రారంభం



- నిర్మాణ కార్మికుల పిల్లలకు వర్క్ సైట్ వద్దే చదువు
- సీపీ రమేష్, సీఎంసీ కమిషనర్ సృజన చేతుల మీదుగా ప్రారంభం
- 58 మంది చిన్నారులకు విద్యతో పాటు మధ్యాహ్న భోజనం

**సైబరాబాద్ - విశాలభారతి:**

వలస నిర్మాణ కార్మికుల పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ దేశంలోనే తొలిసారిగా 'వర్క్ సైట్ స్కూల్'ను నార్సింగిలోని రాజపుష్ప లేబర్ క్యాంప్‌లో సోమవారం ప్రారంభించారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, సీఎంసీ కమిషనర్ సృజన సంయుక్తంగా ఈ పాఠశాలను ప్రారంభించారు. తెలంగాణ విద్యాశాఖ, మున్సిపల్ శాఖ, రాజపుష్ప ప్రాపర్టీస్ సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటైన ఈ విద్యా కేంద్రంలో జార్ఖండ్, ఒడిశా, ఉత్తర్ ప్రదేశ్, అస్సాం రాష్ట్రాల నుంచి వచ్చిన 58 మంది చిన్నారులకు ప్రత్యేక విద్య అందిస్తున్నారు. వీరి కోసం విద్యాశాఖ నుంచి ఒక టీచర్, రాజపుష్ప ప్రాపర్టీస్ తరపున ఒక మహిళా టీచర్‌ను నియమించారు. సర్వ శిక్ష అభియాన్ ద్వారా పాఠశాల వసతి, అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా మధ్యాహ్న భోజనం అందజేస్తారు. ఈ సందర్భంగా సీపీ రమేష్ మాట్లాడుతూ...తెలంగాణ అభివృద్ధిలో వలస కార్మికుల శ్రమ ఎంతో ఉందని, వారి పిల్లలకు రక్షణ కల్పించడం మన బాధ్యత అన్నారు. లేబర్ క్యాంపుల్లో సరైన మార్గదర్శనం లేని పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలై పెడదోవ పట్టే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీ తరహా కేంద్రాలతో క్రమశిక్షణ, మంచి ప్రవర్తన నేర్పించి వారిని నేరాల బారిన పడకుండా చూడాలన్నారు. సైబరాబాద్‌లో 100కు పైగా లేబర్ క్యాంపుల్లోని వేలాది చిన్నారులకు మాతృభాషలోనే విద్య అందించాలని సూచించారు. ఈ ఆలోచనకు కార్యరూపం కల్పించిన నార్సింగి ఎస్‌హెచ్‌ఓ హరికృష్ణా రెడ్డిని అభినందించారు. సీఎంసీ కమిషనర్ సృజన మాట్లాడుతూ... కేవలం రోడ్లు, మౌలిక సదుపాయాలే కాకుండా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కూడా బాధ్యతగా తీసుకుంటామన్నారు. వర్క్ సైట్ స్కూల్ ఒక రోజుకు పరిమితం కాకుండా శాశ్వత వ్యవస్థగా ఉండాలని, సీఎంసీ తరపున కేర్ టేకర్లను ఏర్పాటు చేసి పిల్లల వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. రాజపుష్ప ఫౌండేషన్ శ్రీమతి పుష్పలీల మాట్లాడుతూ వర్క్ సైట్ వద్ద పూర్తిస్థాయి పాఠశాలను ప్రారంభించడం దేశంలో ఇదే తొలిసారి అని, రాబోయే రోజుల్లో ఇలాంటి పాఠశాలలను శాశ్వతంగా ఏర్పాటు చేస్తామన్నారు. రంగారెడ్డి డీఈఓ సుశీంద్రరావు మాట్లాడుతూ ప్రతి బిడ్డకు విద్యా హక్కు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని, లేబర్ క్యాంపుల్లోని పిల్లలకు పాఠశాల వసతి కల్పిస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, కూకట్‌పల్లి ఏడీసీపీ సుదర్శన్, రాజపుష్ప ఎండీ మహేందర్ రెడ్డి, నార్సింగి ఎస్‌హెచ్‌ఓ హరికృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి



# పాలమూరు నుంచే కవిత తొలి అడుగు

- కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై గళమెత్తనున్న టీఆర్ఎస్ అధినేత్రి
- 8న చౌదరిగూడెం వద్ద పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ
- పోస్టర్ ఆవిష్కరించిన తెలంగాణ రక్షణ సేన నాయకులు




**హైదరాబాద్, విశాలభారతి:**

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీని స్థాపించిన తర్వాత ఆ పార్టీ అధినేత్రి, ఉద్యమ నాయకురాలు కల్వకుంట్ల కవిత పాలమూరు గడ్డ మీది నుంచే రాజకీయంగా మొదటి అడుగు వేయనున్నారు. పార్టీ స్థాపించిన తర్వాత జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు తీసుకుని ముందుకు సాగుతానని ప్రకటించిన కల్వకుంట్ల కవిత అన్నట్టుగానే ఈనెల 8న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి కృష్ణా జలాల సాధనకు శంఖారావం పూరించనున్నారు. 8న ఉదయం జోగులాంబ అమ్మవారిని దర్శనం చేసుకోనున్న కవిత అదే రోజు సాయంత్రం పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రతిపాదించిన కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సమీపంలోని చౌదరిగూడెం వద్ద బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. టీఆర్ఎస్ పార్టీ స్థాపించిన తర్వాత తన మొదటి ప్రాధాన్యతగా కృష్ణా జలాల సాధనకు శ్రీకారం చుట్టారు. ఈనెల 8న చౌదరిగూడెం వద్ద "పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ" నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకుని 12 ఏళ్లు గడిచిన తర్వాత కూడా కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ వెనుకబడి ఉండటానికి పాలకుల లోపభూయిష్ట విధానాలే కారణమని పలు వేదికలపై నుంచి కవిత స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి నీళ్లను సమర్థవంతంగా వినియోగించుకుంటూ మన బీళ్లకు మళ్లించుకునేందుకు తమ వద్ద స్పష్టమైన విధానాలు ఉన్నాయని కూడా ప్రకటించారు. ఈ క్రమంలోనే కృష్ణా నీళ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటించే దిశగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదట శంకుస్థాపన చేసిన పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు 11 ఏళ్లు గడిచిన తర్వాత కూడా 50 పనులు పూర్తి చేయకపోవడంపై "జనంబాట" కార్యక్రమంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి ప్రాజెక్టుకు సత్వర అనుమతులు సాధించడంతో పాటు పనులు వేగంగా పూర్తి చేయించడానికి ఉద్యమ ప్రణాళిక ప్రకటించే దిశగా కవిత అడుగులు వేస్తున్నారు. తెలంగాణకు హక్కుగా దక్కే ప్రతి చుక్క నీటిని మన బీడు భూములకు మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**"పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ" పోస్టర్ ఆవిష్కరణ**

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులో రంగారెడ్డి జిల్లాకు నీళ్లు ఇచ్చే కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సహా మూడు ప్యాకేజీల పనులను 11 ఏళ్ల తర్వాత కూడా ప్రారంభించకపోవడంపై ఉద్యమానికి కవిత శ్రీకారం చుట్టారు. ఈనెల 8న కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సమీపంలోని చౌదరి గూడెం వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకులు పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు సాధన పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు నవీన్ ఆచారి, గొంగళ్ల రంజిత్ కుమార్, సయ్యద్ ఇస్మాయిల్, నరేశ్ ప్రజాపతి, ఎదురుగట్ల సంపత్ గౌడ్, సీమ రమేశ్, బుచ్చిబాబు, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే,పేదల సొంతింటి కల సాకారం

- నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం
- పాల్గొన్న జువ్వి నర్సింహ్మ సర్పంచ్



**చౌటుప్పల్, విశాలభారతి:**

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతుందని ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మ అన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామంలో వల్లబోతు శంకరమ్మస్వామి దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ జువ్వి నర్సింహ్మ హాజరై ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ జువ్వి నర్సింహ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకంలో భాగంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో వల్లబోతు శంకరమ్మస్వామి దంపతులు ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకున్నారన్నారు. పేదల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, నిరుపేదల పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గ్రామంలోని ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్, ఐతరాజు శారద లింగస్వామి, రాచకొండ భార్గవ్, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వల్లబోతు నారాయణ, మాజీ ఉప సర్పంచ్ కొంతం బుచ్చిరెడ్డి, ఐతరాజు సత్తయ్య, ఊదరి శంకర్, వల్లబోతు భాస్కర్, చెన్నోజు విజయ్ చారి, ఊదరి ఇస్తారి, ఊదరి పోషయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఊదరి నర్సింహ, ఊదరి స్వామి, వల్లబోతు లింగయ్య, డాకోజి సతీష్, వంగూరి సురేష్, బత్తుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# త్రిష బర్త్ డే స్పెషల్..

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ ఎపిక్ 'విశ్వంభర' సినిమా ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా నటి త్రిష కృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఆమె క్యారెక్టర్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ పోస్టర్‌లో త్రిష ట్రెడిషనల్ లుక్‌లో డివైన్ ఔరాతో కనిపిస్తూ ఆకట్టుకుంది. అయితే ఇది కేవలం గ్లామర్ పాత్ర మాత్రమే కాదని, కథలో కీలక పాత్ర పోషించబోతుందని స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, త్రిష పోషిస్తున్న 'అవని' పాత్ర సినిమా కథలో కీలక మలుపులు తీసుకువచ్చే ప్రధాన అంశంగా ఉండనుంది.ముఖ్యంగా ఈ పాత్ర చుట్టూనే సినిమా నెరేషన్ తిరిగే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటివరకు త్రిష చేసిన పాత్రలతో పోలిస్తే, ఈ పాత్రలో ఎక్కువ ఎమోషనల్ వెయిట్, డెప్త్ ఉండబోతుందని తెలుస్తోంది. కేవలం స్క్రీన్ ప్రెజెన్స్‌కే పరిమితం కాకుండా, కథను ముందుకు నడిపించే డ్రైవింగ్ ఫోర్స్‌గా అవని పాత్ర ఉండటం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. గత కొన్నేళ్లుగా సెలెక్టివ్ ప్రాజెక్ట్స్‌తో ముందుకు సాగుతున్న త్రిషకు 'విశ్వంభర' ఒక స్ట్రాంగ్ కంబ్యాక్‌గా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో పవర్‌ఫుల్ పాత్ర దక్కడం ఆమె కెరీర్‌కు మరో మైలురాయిగా మారవచ్చని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.